క్లుప్తంగా

డయాలసిస్ కేంద్రాల నిర్వహణ భేష్

పటమట(విజయవాడతూర్పు): అత్యాధునిక పరికరాల ద్వారా విజయవాడ పెద్దాసుపత్రిలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ తెలిపారు. విజయవాడ పెద్దాసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని శనివారం సురేష్‌బాబు సందర్శించి రోగులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ హాస్పటల్స్ కంటే దీటుగా వివిధ రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండటం ప్రశంసనీయమన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో రాష్ట్రంలో చిరస్మరణీయ సేవలు అందించి లక్షల మందికి ప్రాణం దానం చేసిన ఘనత విజయవాడ పెద్దాసుపత్రి సిబ్బందికి దక్కుతుందన్నారు. మరిన్ని వైద్యసేవలు అందించడానికి రాష్ట్రంలోని స్వచ్ఛంద సంస్థలు, దాతలు భాగస్వాములు కావాలని కోరారు. తొలుత ఆసుపత్రి సూపరింటెండెంట్ డి.వెంకటేష్‌ను సురేష్ బాబు మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు.

నిబంధనలకనుగుణంగా విధుల నిర్వహణ



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

పటమట(విజయవాడతూర్పు): వైద్య, ఆరోగ్య సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని అన్నారు. ఆమె శనివారం వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిడమానూరు - 2 హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె నిడమానూరు-1లో నిర్వహిస్తున్న చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం, ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గొల్లపూడి 5 హెల్త్ క్లినిక్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ అద్భుతంగా అమలు

మెహబూబ్ షేక్

పటమట(విజయవాడ తూర్పు): డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల ప్రాణాలను కాపాడేందుకు ఆరోగ్యశ్రీని ప్రవేశపెడితే.. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పథకాన్ని అద్భుతంగా అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం కృష్ణా, గుంటూరు, ఎన్టీయార్ జిల్లాల జోనల్ ఇన్‌చార్జి మెహబూబ్ షేక్ అన్నారు. శనివారం సూర్యారావుపేటలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పేదల కోసం నాన్నగారు ఒక అడుగు ముందుకు వేస్తే.. ఆ తండ్రికి కొడుకుగా నేను రెండు అడుగులు ముందుకు వేస్తా.. అని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన మాటలను ఆచరణలో చేసి చూపించారని కొనియాడారు. కేవలం ఆరోగ్యశ్రీ పథకం కోసం నాలుగేళ్లలో ప్రభుత్వం రూ.9,025 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. వైద్య, ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.

ఇద్దరి అరెస్ట్

–3 కేజీల గంజాయి స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను కొత్తపేట పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నైజాంగేటు ప్రాంతంలో గంజాయి అక్రమంగా రవాణా అవుతుందని కొత్తపేట పోలీసులకు సమాచారం అందింది. సీఐ సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో నైజాంగేటు ప్రాంతంలో తనిఖీలు చేశారు. ఇద్దరు యువకులు సంచితో వెళ్తుండగా, వారిని అదుపులోకి తీసుకుని ఆరా తీశారు. ఇద్దరు యువకులు గొల్లపాలెంగట్టు బూస్టర్ ప్రాంతానికి చెందిన షేక్ సిద్దిక్, ఎర్రకట్ట మెట్ల ప్రాంతానికి చెందిన బుసారి దుర్గాప్రసాద్‌గా గుర్తించారు. నిందితుల్లో ఒక్కొక్కరి నుంచి 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేయడంతో పాటు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): హైదరాబాదు వెళ్తున్నానని బయలుదేరిన వ్యక్తి కనిపించడం లేదని నున్న పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకాష్‌నగర్‌కు చెందిన వెలగాడి గిరిజ పెద్దనాన్న బేతపూడి నాగరాజు గుడివాడ వద్ద పర్నసా అనే గ్రామం నుంచి ప్రకాష్‌నగర్ వచ్చాడు. గిరజ అక్కడ స్వరూపరాణి. ఆమె హైదరాబాద్‌లో ఉంటోంది. అక్కడకు వెళ్తున్నానన్ని నాగరాజు బయలుదేరి వెళ్లాడు. మరుసటి రోజు హైదరాబాదు ఫోను చేయగా రాలేదని గిరిజ అక్క చెప్పింది. పలుచోట్ల వెదికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాలుగేళ్లలో 99 శాతం హామీల అమలు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సింగ్‌నగర్‌లో జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాలుగేళ్ల పాలనలో 99శాతం హామీలు అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని నవరత్నాలతో నవశకానికి నాంది పలికారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59 వ డివిజన్ 254 వ వార్డు సచివాలయ పరిధి అజిత్‌సింగ్‌నగర్‌లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం జరిగింది. స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానాతో కలిసి ఆయన పాల్గొన్నారు. వీఎంసీ అధికారులు వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి గడప గడపకూ వెళ్లి స్థానిక సమస్యలను స్వయంగా తెలుసుకుని ప్రభుత్వం చేసిన మంచితో పాటు ముఖ్యమంత్రి రాసిన లేఖను లబ్ధిదారులకు వివరించారు.

సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయం

స్థానిక సమస్యలను స్వయంగా గుర్తించి సత్వర పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని మల్లాది విష్ణు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్టోర్ రూమ్‌కే పరిమితమయ్యేవని తాము అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నామని చెప్పారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పవన్ వ్యాఖ్యలు

రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తున్న వ్యవస్థలను టార్గెట్ చేయడం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు తగదని మల్లాది విష్ణు హితవు పలికారు. తణుకు సభలో పవన్ వ్యాఖ్యలు మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని మండిపడ్డారు. ఒకప్పుడు టీడీపీ, బీజేపీ పనిగట్టుకుని విషప్రచారం చేసిన అంశాలనే.. మళ్లీ తెరపైకి తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. హిందూ దేవాలయాలపై దాడులు, కూల్చివేతలు అత్యధికంగా జరిగింది టీడీపీ, జనసేన కలిసి అధికారాన్ని పంచుకున్న సమయంలోనేనని నిప్పులు చెరిగారు. చెత్త తరలించే వాహనాల్లో దేవతామూర్తుల విగ్రహాలను తీసుకెళ్లిన దారుణ సంఘటనలు చోటు చేసుకుంది 2014–19 మధ్యకాలంలో కాదా..? అని సూటిగా ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత హిందూ ధర్మాన్ని కాపాడుతూ, దేవాలయాల వ్యవస్థను పరిరక్షిస్తూ ముందుకెళ్తున్నారని మల్లాది విష్ణు అన్నారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు హఫీజుల్లా, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపల్లి బొమ్మలు కేంద్ర అవార్డు సాధించేలా ప్రణాళికలు

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కొండపల్లి బొమ్మలు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసే వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్-2023 అవార్డు సాధించేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. శనివారం విజయవాడలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు హస్త కళల అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.విశ్వ, జిల్లా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, పరిశ్రమలు, లేపాక్షి, హ్యాండ్లూమ్స్, తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా వన్ డిస్ట్రిక్ట్- వన్ ప్రొడక్ట్-2023 అవార్డుల్లో భాగంగా మన జిల్లా నుంచి కొండపల్లి బొమ్మలను ప్రతిపాదించామన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాస్ వ్యవసాయాధికారి ఎస్ నాగమణమ్మ, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సుధాకర్, డిస్ట్రిక్ట్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్ టైల్స్ ఆఫీసర్ కె. అప్పారావు తదితరులు ఉన్నారు.

స్కానింగ్ సెంటర్లలో నిరంతర తనిఖీలు చేయాలి

జిల్లా వైద్యాధికారులు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం నిబంధనలు అమలు తీరును పరిశీలించాలని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పీసీపీ ఎన్డీటీ చట్టం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్, కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ అధికారుల పరిశీలనలో నిబంధనలను అతిక్రమించినట్లు గుర్తిస్తే ఆయా సెంటర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. సమావేశంలో 7 కొత్త సెంటర్ల రిజిస్ట్రేషన్, 6 సెంటర్ల రెన్యూవల్, మార్పులు, చేర్పులు వచ్చిన 8 దరఖాస్తులను ఆమోదించారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ. సత్యానంద్ మాట్లాడుతూ కొత్తగా స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు, రెన్యువల్ , మార్పులు, చేర్పులకు సంబంధించి వచ్చే దరఖాస్తులను పరిశీలించి కమిటీకి నివేదించాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్ఓ సుహాసిని, ఏసీపీ వెంకటేశ్వరరావు, మెడికల్ ప్రాక్టీషనర్ వి.పద్మజ, సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉందాం

వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి బుజ్జి



కొండపల్లి బుజ్జిని సత్కరిస్తున్న ఆంజనేయరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్య, వైద్య, వ్యాపార రంగం అభివృద్ధికి చిత్తశుద్ధి, అంకిత భావంతో పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండి వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీని గెలిపించుకుని ఆయన్ని మళ్లీ ముఖ్యమంత్రిగా చేస్తామని పలువురు నినదించారు. భవానీపురం గాంధీ బొమ్మ రోడ్డులోని విజేత హైస్కూల్ ఆవరణలో శనివారం విద్యావేత్తలు, వ్యాపారస్తులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు పల్లపోతు మురళీకృష్ణ (కొండపల్లి బుజ్జి) మాట్లాడుతూ నాలుగేళ్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనలో వాణిజ్యంతోపాటు అన్ని రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. అటువంటి యువ ముఖ్యమంత్రికి అండగా ఉండి ఆయన నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఉందని చెప్పారు. విజేత హైస్కూల్ అధినేత, 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ విద్యా రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చి విద్యార్థుల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ నాళం నాగేశ్వరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివ, వాణిజ్య ప్రముఖులు కాసుల రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండపల్లి బుజ్జిని కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి సత్కరించారు.

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారె తీసుకెళ్తున్న దేవీనగర్ భక్తబృందం సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ భక్తబృందం ఆధ్వర్యాన శనివారం ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మకు ఆషాఢ మాస సారె సమర్పించారు. ప్రజలు సుఖసంతోషాలతో వర్థిల్లాలని అమ్మవారి దయ ప్రతి ఒక్కరికీ లభించాలని ఏటా ఆషాఢ సారెను అమ్మవారికి సమర్పిస్తున్నట్లు భక్తబృందం సభ్యులు తెలిపారు. దేవీనగర్ 5వ రోడ్డు నుంచి అమ్మవారి ప్రతిమ, సారెతో మేళతాళాలు, ఊరేగింపుగా భక్తి గీతాలు ఆలపిస్తూ ఇంద్రకీలాద్రికి వెళ్లారు. వీరికి దేవస్థానం సిబ్బంది సాదర స్వాగతం పలికారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో శనిత్రయోదశి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు నవగ్రహాలు, శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తైలాభిషేకం చేశారు.

ఫార్మసీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులు

రామవరప్పాడు: విద్యార్థులు తమలోని వ్యక్తిగత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విజయ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో శనివారం ప్రపంచ యువత నైపుణ్య శిక్షణ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మలత మాట్లాడుతూ నూతన పరిశోధనలు చేసి కొత్త కొత్త ఔషధాలను కనిపెట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఔషధాల తయారీ శిక్షణలో మెలకువలపై అవగాహన పొందారు. కార్యక్రమంలో కళాశాల బీఫార్మసీ, ఫార్మా.డి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు న్యూ ఆర్ఆర్‌పేటలో మెగా ఉచిత వైద్యశిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): న్యూరాజరాజేశ్వరిపేట వాటర్‌ట్యాంక్ రోడ్డులో సీతారామపురంలోని దీపక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ పి.సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధుమేహం, రక్తపోటు, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. జనరల్ మెడిసిన్ స్పెషలిస్టుతో పాటు, డ్యూటీ డాక్టర్స్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్సలు అవసరమైన వారికి 50 శాతం రాయితీపై చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8374574666లో సంప్రదించాలని సూచించారు.

దుర్గాబాయ్ స్ఫూర్తితో సేవ చేయాలి



దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సంఘసంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ స్ఫూర్తితో దేశానికి సేవ చేయాలని మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు పిలుపునిచ్చారు. ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవం సందర్భంగా దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ 114వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన.. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరాజు, కోశాధికారి డీజీ పీఎస్ రాజుతో కలిసి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర మహిళా సభను ప్రారంభించి మహిళల సంక్షేమానికి ఆమె చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. సాంస్కృతిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, గ్రంథాలయ కమిటీ అధ్యక్షులు కె.సుబ్బరాజు, కార్యదర్శి సుబ్బరాజు దుర్గాభాయి దేశ్‌ముఖ్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.ప్రసాద రాజు, పి.రాంబాబు, టి.సత్యనారాయణ, పిచ్చిరాజు, సీనియర్ సిటిజన్ సాగి భగవాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



దాత వాసుకు జ్ఞాపికను అందజేస్తున్న కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వీఎంసీ ప్రాథమిక పాఠశాలకు శనివారం వీరమాచనేని హియతేజ్ జ్ఞాపకార్థం గోరంట్ల వాసుబాబు బోధనాపరికరాలను బహూకరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు దాతల సాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. దాత గోరంట్ల వాసుబాబును కార్పొరేటర్, ఉపాధ్యాయులు శాలువా కప్పి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అలంపూరు విజయ్, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి ప్రాథమిక పాఠశాలలో గోరంట్ల వాసుబాబు బోధనా పరికరాలను బహూకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ, విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు నాయక్, హైస్కూల్ హెచ్ఎం దుర్గాప్రసాద్, స్కూల్ హెచ్ ఎం హనుమంతరావు, ఉపాధ్యాయులు, నేతలు అక్కిశెట్టి నారాయణ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరింత విస్తృతం చేస్తాం

బీఓఐ జనరల్ మేనేజర్ గీతా నాగరాజన్



లబ్ధిదారులకు రుణాలు అందజేస్తున్న గీతా నాగరాజన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కస్టమర్ అవుట్ రీచ్ కార్యక్రమం ద్వారా బ్యాంకు సేవలను ప్రజలకు మరింత విస్తృతం చేస్తామని బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీఓఐ) జనరల్ మేనేజర్ గీతా నాగరాజన్ అన్నారు. ఒకే బ్యాంక్ అనేక రుణాలు అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. శనివారం గవర్నర్‌పేటలోని ఓ హోటల్‌లో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రుణ వితరణ, వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఈ ఆమె మాట్లాడుతూ తమ బ్యాంకు రూ.12 లక్షల కోట్ల మేర వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం కస్టమర్లకు రిటైల్‌లో రూ.25 కోట్లు, ఎంఎస్ఎంఈలో రూ. 15 కోట్లు, అగ్రిలో రూ.21 కోట్ల రుణాలు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోన్ జెడ్ఎం ఎంవీవీ బంగారాజు, కేవీఐసీ డైరెక్టర్ డాక్టర్ గ్రీప్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

నలంద ఇన్వెస్టిచర్ వేడుకల్లో సీఐడీ డీఎస్పీ ఎన్ఎంవీ మురళీకృష్ణ



వేడుకల్లో సీఐడీ డీఎస్పీ మురళీకృష్ణ, ఎన్‌సీసీ ఆఫీసర్ సుదర్శన్, ప్రిన్సిపాల్ పద్మజ



ఆకట్టుకున్న విద్యార్థినుల ప్రదర్శనలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, విద్యార్థి నాయకులుగా సమర్థంగా రాణించాలని సీఐడీ డీఎస్పీ ఎస్ఎంవీ మురళీకృష్ణ అన్నారు. నలంద విద్యానికేతన్ సెకండరీ విభాగం ఇన్వెస్టిచర్ సెర్మనీ వేడుకలు శనివారం ఘనంగా నికేతన్‌లో నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి కొత్తగా ఎన్నికైన ప్రైమరీ, సెకండరీ విద్యార్థినీ, విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం కనుల పండువగా జరిగింది.

మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి నాయకత్వం బాధ్యతతో కూడినదని, త్రికరణశుద్ధిగా పని చేస్తూ , క్రమశిక్షణను పాటిస్తూ అందరినీ ఒక తాటిపై నడిపించే ఉత్తమ నాయకులు అవ్వాలని ఆకాంక్షించారు. విద్యార్థులపైనే దేశ భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. గౌరవ అతిథి అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ సుదర్శన్ మాట్లాడుతూ మీరు కష్టపడి దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ, దీక్ష, మైత్రి, సహన, తేజస్ హౌస్ విద్యార్థినీ, విద్యార్థులు చేసిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. ఉత్తమ శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అతిథులు ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన విద్యార్థి నాయకులతో బ్యాడ్జిలను ధరింపజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్‌బాబు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వృత్తి విద్యను నేర్చుకున్నవారికి ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ఎన్టీఆర్ జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్‌బాబు చెప్పారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా శనివారం రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో సభ జరిగింది. విక్టర్‌బాబు మాట్లాడుతూ చాలా మంది యువత టెక్నికల్ ఆధారిత విద్యను చదవడంపై ఆసక్తి చూపుతున్నారన్నారు. యువతలో నైపుణ్యం పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయన్నారు. వృత్తి విద్య నేర్చుకోవాలనుకునే వారు సమీపంలోని స్కిల్ హబ్ కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. మోడల్ కెరియర్ సెంటర్ యంగ్ ప్రొఫెషనర్ కె.కిషోర్‌బాబు మాట్లాడుతూ వృత్తి విద్యను నేర్చుకున్న వారికి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా యూనిట్‌లు ఏర్పాటుచేసుకోడానికి సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేస్తోందని చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఎంతో మంది యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దామన్నారు. జనశిక్షణ సంస్థాన్ సంస్థ సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు.

ఉపా చట్టం, ఎన్ఐఏలను రద్దు చేయాలి

ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు



మాట్లాడుతున్న గంటా రామారావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ఉపా చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్,సీనియర్ న్యాయవాది గంటా రామారావు డిమాండ్ చేశారు. శనివారం ధర్నా చౌక్ లో ఉపా రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉపా చట్టం, ఎన్ఐఏలను రద్దు చేయాలని కోరుతూ మహాధర్నా జరిగింది. పోరాట కమిటీ కన్వీనర్ చిలుకా చంద్ర శేఖర్ అధ్యక్షతన జరిగిన మహాధర్నాలో ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన ఉపా కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాదులు ఎ.సత్యప్రసాద్, పోసాని వెంకటేశ్వర్లు, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, ఉపా రద్దు పోరాట కమిటీ కో కన్వీనర్ దుడ్డు ప్రభాకర్, న్యాయవాదులు రాజేంద్ర ప్రసాద్, అజయ్‌కుమార్, జైభీమ్ రావు, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శారద కళాసమితి సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

విద్యావేత్త డాక్టర్ ఎంసీదాస్



పద్మశ్రీ హేమంత్‌ను సత్కరిస్తున్న శంకరరావు, ఎంసీ దాస్, సాంబశివరావు, వంశీరామరాజు

విజయవాడ కల్చరల్: శారద కళాసమితి సాంస్కృతిక సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకోవాలని విద్యావేత్త ఎంసీదాస్ అన్నారు. శారద కళాసమితి 45 వార్షికోత్సవం శనివారం గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించారు. ఎంసీదాస్ మాట్లాడుతూ సాంఘిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో కళాసమితి జాతీయ స్థాయిలో అనేక కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. ఎందరో వర్ధమాన కళాకారులను పరిచయం చేశారని గుర్తు చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు దోగిపర్తి శంకరరావు మాట్లాడుతూ సంవత్సరాలుగా విశేషమైన సేవలను అందిస్తునట్లు తెలిపారు. అక్కినేని నాగేశ్వరరావు, రామారావు, కాంతారావు, సూర్యాకాంతం, సావిత్రి, శోభన్ బాబుతోపాటు పలువురు నటులతో నగరంలో అనేక కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. హనుమంతరాయ గ్రంథాలయాన్ని 25 లక్షల వ్యయంతో ఆధునీకరించామని అనుబంధంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో 40 వేల పుస్తకాలతో పరిశోధకులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. విద్యావేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు వివిధ సాహితీ సంస్థ ప్రతినిధులు వంశీరామరాజు, బొప్పన నరసింహారావు, పరచూరి విజయలక్ష్మి, పట్టస్వామి సుజాత ప్రసంగించారు. ఎంఆర్ఎస్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు. సప్తా శివకుమార్, లేఖ్యా భరణి బృందాలు పలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించాయి. నాట్యాచారిణి పద్మశ్రీ హేమంత్‌ను సంప్రదాయ నృత్యానికి చేసిన సేవలను గుర్తించి ఆత్మీయంగా సత్కరించారు. 45 మంది పేద కళాకారులకు దుస్తులు పంపిణీ చేశారు.

పాజిటివ్ దృక్పథంతో ఒత్తిడిని జయించవచ్చు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వృత్తిపరంగా జర్నలిస్టులు నిత్యం ఎదుర్కొనే ఒత్తిడిని పాజిటివ్ దృక్పథం అలవర్చుకుని జయించవచ్చని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (రిటైర్డ్) వైస్ చాన్సలర్, సైకాలజిస్ట్ డి.జమున చెప్పారు. సీ రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న డిప్లొమో కోర్సు ఇన్ జర్నలిజంలో భాగంగా శనివారం వర్చువల్ విధానంలో ప్రత్యేక ప్రసంగాల కార్యక్రమం జరిగింది. జమున మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న పోటీతత్వంతో జర్నలిస్టులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. దీన్ని అదుపులో ఉంచుకోడానికి పాజిటివ్ దృక్పథంతో పాటుగా నిత్యం శారీరక వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటిని చేస్తే ఒత్తిడిని కొంత వరకు జయించవచ్చునని చెప్పారు. జర్నలిస్టుల్లోనే కాకుండా ప్రతి ఒక్కరిలో ఒత్తిడి ఉంటుందని, గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండటంతో కుటుంబంలోని సభ్యులతో మాట్లాడి బాధను తగ్గించుకునే ప్రయత్నం చేసేవారన్నారు. మనస్సులోని బాధను బయటకు చెప్పడంతో చాలా వరకు ఒత్తిడి తగ్గుతుందని జమున చెప్పారు. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, మీడియా అకాడమీ కార్యదర్శి బాలగంగాధర తిలక్, మీడియా అకాడమీ కంటెంట్ ఎడిటర్ శరత్‌బాబు ఆన్‌లైన్ ప్రసంగాలకు సమన్వయకర్తగా వ్యవహరించారు. డిప్లొమో కోర్సు చేస్తున్న వారితో పాటుగా వివిధ ప్రాంతాల్లోని వర్కింగ్ జర్నలిస్టులు ప్రసంగాన్ని విన్నారు.